సరికొత్తగా పూర్ణామార్కెట్

నాడు నగరానికే తలమానికమైన పూర్ణామార్కెట్‌లో కనీస వసతులు కూడా ఉండేవి కావు. దుకాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఫుట్‌పాత్ గానీ, తాగునీటి సౌకర్యం గానీ ఉండేవి కాదు. ప్రభుత్వాలు మారిన ప్రతీసారి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పడమే తప్ప ఆ దిశగా చర్యలేవీ చేపట్టకపోవడంతో వ్యాపారులు చాలా ఇబ్బంది పడేవారు.

నేడు పూర్ణామార్కెట్‌ను రూ.50 లక్షలతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. విద్యుత్, తాగునీటి వసతులతో పాటు వ్యాపారుల కోసం అదనంగా షెడ్ల నిర్మాణం చేపట్టారు. మెట్లు నిర్మించారు. పెయింటింగ్స్, ఫుట్‌పాత్ టైల్స్, మార్కెట్ చుట్టుపక్కల రహదారులు, సీసీ రోడ్లు నిర్మించి వ్యాపారులకు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చేశారు.



వ్యాపారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చేతి పంపు



పూర్ణామార్కెట్‌లో నిర్మించిన అదనపు రేకుల షెడ్



మార్కెట్లో చేపల దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ టైల్స్

వందేళ్ల మార్కెట్‌కు కొత్త కళ

రూ.50లక్షలతో పూర్తిస్థాయి వసతులు

హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు



ఇది కదా అభివృద్ధి

ప్రాంతం : పూర్ణామార్కెట్	
అభివృద్ధి నిధులు : రూ.50 లక్షలు	
కల్పించిన వసతులు	
అదనపు షెడ్ నిర్మాణం	
మెట్ల నిర్మాణం, పెయింటింగ్, లైటింగ్, రైలింగ్	
దుకాణాలకు దిమ్మల ఏర్పాటు	
చేతిపంపు, టైల్స్, గేట్లు	



పూర్ణామార్కెట్ వ్యూ

జగదాంబ: వందేళ్ల పూర్ణామార్కెట్ కొత్త వెలుగులు సంతరించుకుంది. శ్రీకాకుళం నుంచి అల్లూరి జిల్లా వరకు ప్రతీ ఒక్కరికీ సుపరిచితమైన ఈ మార్కెట్‌లో దొరకని వస్తువే ఉండదు. అందుకే ఎన్ని రైతుబజార్లు వచ్చినా, మరెన్ని సూపర్ బజార్లు వెలసినా ఈ మార్కెట్ ఇప్పటికీ జనంతో కిక్కిరిసే ఉంటుంది. నగరానికే తలమానికమైనప్పటికీ గత పాలకుల నిర్లక్ష్యంతో కనీస వసతులకు నోచుకోలేదు. ప్రస్తుతం పరిస్థితి మారింది. వైఎస్సార్‌సీపీ పాలనలో మార్కెట్ కొత్త సొబగులు అద్దుకుంది. పూర్తిస్థాయి వసతులు కల్పించడంతో వ్యాపారుల ఇక్కట్లు తొలగాయి.

వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల కాలంలో పూర్ణామార్కెట్‌లో రూ. 50 లక్షలకు పైగా వెచ్చించి వసతులు కల్పించారు. ఏ,బీ,సీ,డీ కేటగిరీల కింద రెండున్నర ఎకరాల్లో సుమారు 500 మేర దుకాణాలు ఉన్న మార్కెట్‌లో అభివృద్ధి వెలుగులు చూపించారు. కార్పొరేటర్ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు జరగడంతో పూర్ణామార్కెట్‌కు కొత్త కళ ఏర్పడింది.

చేపట్టిన పనులు

- ప్రమాదకరంగా వేలాడుతూ ఉన్న విద్యుత్ తీగలు తొలగించి, పటిష్టంగా వైరింగ్ చేయించారు.
- దుకాణాలపై షెడ్లు వేశారు. మార్కెట్ బయట అదనంగా కొత్త షెడ్లు నిర్మించారు.
- మార్కెట్‌లో మెట్లు నిర్మించారు.
- పెయింటింగ్ వర్క్స్ పూర్తి చేశారు.
- ఫుట్‌పాత్ టైల్స్, మార్కెట్ చుట్టుపక్కల రహదారులు, సీసీ రోడ్లు నిర్మించారు.
- రూ.10 లక్షలతో చేతిపంపు, టైల్స్ ఏర్పాటు చేశారు.
- రూ.10 లక్షలతో గేట్లు నిర్మించారు.

సీసీ రోడ్డుతో ఇబ్బందులు తొలగాయి



పూర్ణామార్కెట్‌ను ఆనుకుని ఉన్న అరటిపండ్ల సందులో గతంలో సరైన రోడ్డు లేక ఇబ్బంది పడేవాళ్లం. ఒకపక్క యూజీడీ, మరోపక్క వర్షపునీటితో అడుగు వేయాలన్నా భయమేసేది. ఇప్పుడు సీసీ రోడ్డు నిర్మించడంతో అవస్థలు తప్పాయి.

– మంగ, పూర్ణామార్కెట్ చేపల వ్యాపారి

వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైంది



గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. కానీ ఎవ్వరూ పట్టించుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలోనే మార్కెట్‌ను అభివృద్ధి చేశారు. వ్యాపారులకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పించారు.

– శ్రీనివాసరావు, పూర్ణామార్కెట్ కూరగాయల వ్యాపారి

మార్కెట్ కళకళలాడుతోంది



మార్కెట్‌లో వసతులు కల్పించాక వినియోగదారుల సంఖ్య పెరిగింది. గతంలో విద్యుత్ వైర్లు వేలాడుతూ ఉండడంతో లోపలికి రావడానికి కూడా భయపడేవారు. ఇప్పుడు ఆ సమస్యే లేదు. వినియోగదారులు వస్తుండటంతో మార్కెట్ కళకళలాడుతోంది. వ్యాపారాలు సక్రమంగా సాగుతున్నాయి. – రాము, వ్యాపారి

చాలాకాలం తరువాత..



చాలాకాలం తరువాత పూర్ణామార్కెట్ అభివృద్ధి జరిగింది. దుకాణాలు సంఖ్య పెరిగింది. వ్యాపారాలు కూడా బాగున్నాయి. ఇదంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చలవే.

– మణమ్మ, చిరు వ్యాపారి, పూర్ణామార్కెట్

క్లుప్తంగా

మార్గశిర మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం మార్గశిర మాసోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఆలయ ఈవో కె.శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం నేతృత్వంలో ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసుపల్లి మాట్లాడుతూ మార్గశిర మాసోత్సవాలు వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్:కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ. 1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

'ఆడుదాం ఆంధ్ర' పోస్టర్ ఆవిష్కరణ

అల్లిపురం: యువ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన ×ఆడుదాం ఆంధ్ర౯ కార్యక్రమాన్ని యువత వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సూచించారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల రిజిస్ట్రేషన్ మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. శాప్ ఎండీ ధ్యాన్ చంద్ర మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 15 ఏళ్ల పైబడిన క్రీడాకారులు సమీపంలోని వార్డు సచివాలయంలో, వలంటీర్ల ద్వారా గానీ ఆన్‌లైన్‌లో aadudamandhra. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఇద్దరు బాలలకు ఆశ్రయం



బాలుడిని నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయికి అప్పగిస్తున్న రైల్వే పోలీసు

అల్లిపురం: రైలులో విశాఖ చేరుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్న ఇద్దరి బాలలకు జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఏయూటీడీ టీఎస్ఆర్ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన బాలిక ఇంటిలో గొడవ పడి నగరానికి రైలులో చేరుకుంది. రైల్వే పోలీసులు ఆమెను స్టేషన్‌లో గమనించి ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయ వసతి గృహానికి అప్పగించారు. అస్సాంకు చెందిన ప్రసాద్‌ను కూడా రైల్వే పోలీసులు గమనించి నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో పర్యావరణ పరిరక్షణ-ప్లాస్టిక్ నిషేధం అంశంపై గ్లోబల్ ఫౌండేషన్ నేతృత్వంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడా విద్యాసంస్థల అధినేత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. మహిళా సాధికారతతో పాటు జంతువుల పరిరక్షణ తమ బాధ్యతగా పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు, కాలుష్యం మరింత పెరుగుతున్నాయని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్కర్ష్ కో-ఆర్డినేటర్ టీనా రాజు, ప్రిన్సిపాల్ షైజీ, ఎం.శ్రీనాథ్, డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, నళిని, హరిణి, సుధ, శారదా సిస్టర్ హేమ, తదితరులు పాల్గొన్నారు.

మునిగిన బోట్లు వెలికితీతకు వినతి



పోర్టు ట్రాఫిక్ మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

అల్లిపురం: ఫిషింగ్ హార్బర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో మునిగిపోయిన బోట్లను త్వరితగతిన వెలికితీయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పోర్టు అథారిటీ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం పోర్టు ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. దగ్ధమైన బోట్లు నీటిలో మునిగిపోవడంతో మిగతా మత్స్యకారులు తమ బోట్లు నిలపలేక ఇబ్బంది పడుతున్నారని, వేటకు వెళ్లి తెచ్చుకున్న చేపలను అన్‌లోడింగ్ చేసుకోలేకపోతున్నారని గురువులు వివరించారు. ఈ మేరకు స్పందించిన ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ త్వరలోనే వాటిని బయటకు తీసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారని కోలా గురువులు పేర్కొన్నారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆవేదన దీక్ష



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవేదన దీక్ష చేపట్టిన కాంట్రాక్ట్ ఉద్యోగులు

సీతమ్మధార : జిల్లా సమగ్ర శిక్ష అభియాన్‌లో 12 ఏళ్లుగా కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవేదన దీక్ష చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. జేఏసీ అధ్యక్షుడు వి.పుండరీకాక్ష మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల గడుస్తున్నా ఎటువంటి ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మినిమం టైం స్కేల్ అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికి అమలు చేయలేదన్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నుంచి సమ్మె బాట పట్టాలని ప్రభుత్వానికి నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 11న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పి.గణపతిరావు, ఎల్.చైతన్య, టి.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో 'అల'జడి



అల్లకల్లోలంగా సముద్రం



వ్యాపారాలు సాగక వర్షంలోనే నిరీక్షిస్తున్న చిరు వ్యాపారులు

ఇళ్లకే పరిమితమైన ప్రజలు

దాబాగార్డెన్స్: మిచాంగ్ తుపాను ప్రభావంతో సముద్రతీర ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. కోస్టల్ బ్యాటరీ డౌన్ బీచ్ నుంచి ఫిషింగ్ హార్బర్ వరకు ఉవ్వెత్తున కెరటాలు ఎగసిపడుతున్నాయి. ఈదురు గాలులకు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉన్న బీచ్‌రోడ్డులో ప్రకటన బోర్డులు, హెచ్చరిక బోర్డులు నేలకూలాయి. అలల ఉధృతితో తీరాన్ని ఆనుకుని ఉన్న ఫిషింగ్ హార్బర్ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. సందర్శకులు ఎవరూ సముద్రంలోకి దిగి స్నానాలు చేయరాదని మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డులు, మహారాణిపేట పోలీసులు ఉదయం నుంచి హెచ్చరికలు జారీ చేశారు. ఆర్కే బీచ్, గోకుల్‌పార్క్, నోవాటెల్ బీచ్ వెలవెలబోయాయి. చిన్న చిన్న దుకాణాలు సైతం మూతపడ్డాయి. తీరంలో కెరటాలు ఎగసి పడడంతో మెరైన్ పోలీసులు ఎవరినీ లోపలకు రానివ్వలేదు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపదడపా కురిసిన వర్షానికి జనసంచారం లేక రోడ్లన్నీ వెలవెలబోయాయి. ఫుట్‌పాత్ వ్యాపారాలు సాగలేదు. చిరు వ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు.

కాలువల పరిశుభ్రతకు ప్రాధాన్యం



టౌన్‌కొత్తరోడ్డు వద్ద కాలువలు శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్ఓ రాజేష్

జగదాంబ: ప్రధాన రహదారుల్లో కాలువల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ సూచించారు. సోమవారం ఆయన జోన్-4 పరిధిలో జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డు వద్ద రహదారులు, వార్డుల్లో కాలువలను పరిశీలించారు. టౌన్‌కొత్తరోడ్డు వద్ద నీటి ప్రవాహానికి ఆటంకంగా మారడంతో కాలువను ఆయన దగ్గరుండి పరిశుభ్రం చేయించారు. ప్రధాన రహదారుల్లో కాలువలు ఇలా ఉంటే నీటి ప్రవాహం సాధ్యమేనా అని ప్రశ్నించారు.

క్రీడాకారులకు సహకారం



క్రీడాకారులకు సాయం అందిస్తున్న వాసుపల్లి

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి హాజరవుతున్న క్రీడాకారులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. 32వ వార్డు చలువతోట, శ్రీ సంతోషిమాత యూత్ అసోసియేషన్ ప్రతినిధులకు క్రీడా సామగ్రి కొనుగోలు నిమిత్తం రూ.15వేలు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో 32వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బోణి దేవ, సిటీ సెక్రటరీ ఆదివిష్ణు, బాబుల్ శ్రీను, బొడ్డేటి కిషోర్, కోటి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వాసుపల్లి పర్యటన



పెద్రివీధిలో ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

జగదాంబ: మిచాంగ్ తుపాను నేపథ్యంలో అధికారులు లోతట్టు ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కోరారు. సోమవారం సాయంత్రం ఆయన తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన జీవీఎంసీ 39వ వార్డు పెద్రిరోడ్డు, చిలక వీధి ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు వివరించారు. పెద్రిరోడ్డులో నివాసం ఉంటున్న కుటుంబాలకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. వీధి చివరలో ఉన్న మురికి కాలువల్లో పందులు సంచారం ఎక్కువగా ఉందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే ఎమ్మెల్యే జోనల్ కమిషనర్, పోలీసు అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను తక్షణమే పరిష్కారం చేశారు. చిలకపేటలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురికినీరు ఇళ్లలోకి ప్రవేశిస్తుందన్నారు. దీనికి కూడా శుభ్రం చేయాలన్నారు.

అయ్యప్ప భక్తులకు అల్పాహారం

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భక్తులకు సోమవారం అల్పాహారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు అల్పాహారం వడ్డించారు. ఉదయం వేళ ఘోషాస్పత్రిలో కూడా రోగులకు అల్పాహారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠుడికి నీరాజనం





విశేష అలంకరణలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామి, పంచముఖేశ్వరస్వామి



బురుజుపేట శివాలయం వద్ద మహాశివునికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: నీలకంఠుడికి భక్తులు నీరాజనాలు సమర్పించారు. కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సింగ్ హోటల్ జంక్షన్ ఓంకారేశ్వరాలయంలో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. గొల్లలపాలెం శెట్టిబలిజ సంఘం వద్ద ఉన్న సాయి రామలింగేశ్వరాలయం రావి చెట్టు వద్ద మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. సూర్యాబాగ్ విశ్వేశ్వరాలయంలో వేకువజాము నాలుగు గంటల నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. స్వామికి ఏకవారాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అస్సాంగార్డెన్స్ శ్రీ శివరామకృష్ణ దేవస్థానం, బౌడారా రోడ్డులోని మురళీధర వీధి శ్రీ పంచముఖేశ్వర దక్షిణామూర్తేశ్వర దేవాలయం, సూర్యాబాగ్ అగ్నిమాపక కేంద్రం సమీపాన ఉన్న ఉమా రామలింగేశ్వరాలయంలో భక్తుల తాకిడి కనిపించింది. ఏవీఎన్ కాలేజ్‌లోని శివాలయంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. సాయంత్రం పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

అల్లిపురం: కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు శివయ్యను దర్శించుకునేందుకు బారులు తీరారు. అస్సాంగార్డెన్స్‌లో వెలసిన శ్రీశివరామకృష్ణ దేవస్థానంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వరస్వామి, బౌడరారోడ్డులోని రామలింగేశ్వరస్వామి ఆలయం, మురళీధరవీధి పంచముఖేశ్వరస్వామి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన ఆకాశ దీప పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీప దర్శనం చేసుకున్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవారిని దర్శించుకున్న సీతంరాజు సుధాకర్, తదితరులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై శ్రీవెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా కల్యాణ దంపతులైన పీల వెంకట అప్పలనాయుడు స్వగృహం నుంచి ఉత్సవ మూర్తుల విగ్రహాలను మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య తిరువీధిగా వెంకటేశ్వరమెట్టపై ఉన్న వెంకట గౌరీ శంకర గ్రంథాలయానికి తీసుకువచ్చారు. తరువాత వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య ఉత్సవమూర్తులకు కల్యాణం చేశారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు భీశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి శరగడం మోహన్ రావు, కోరిబిల్లి త్రినాథ్, శరగడం ధర్మశంకర్ భాస్కర్, ఉషా దంపతులు, అల్లిపురం, వెంటేశ్వరమెట్ట ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే గౌరీ పరమేశ్వరులను వైఎస్సార్‌సీపీ నాయకుడు దక్షిణ నియోజకవర్గం నాయకులు సీతంరాజు సుధాకర్‌తో పాటు వార్డు నాయకులు రంధి గోపీకృష్ణ, బొడ్డేటి ప్రసాద్ దర్శించుకున్నారు.